నమస్తే తెలంగాణ
# నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
16 అక్టోబర్ 2024
పేజీలు 8

## జీవనోపాధికి ప్రత్యేక కమిటీ

మూసీనది ప్రక్షాళనలో భాగంగా నిర్వాసిత కుటుంబాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్ సీఈవో చైర్మన్‌గా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ వైస్ చైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేశారు.

## వార్తల్లో వ్యక్తులు

### రతన్ టాటా

- ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా అక్టోబర్ 9న మరణించారు. 1937, డిసెంబర్ 28న ముంబయిలో ఆయన జన్మించారు. 1962లో టాటా సంస్థలో అడుగు పెట్టారు. మొదట టాటా స్టీల్ సంస్థలో షాప్ ఫ్లోర్‌లో ఉద్యోగిగా పని చేశారు. 1971లో నేషనల్ రేడియో, ఎలక్ట్రానిక్స్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. 1991లో జేఆర్డీ టాటా వారసుడిగా టాటా సన్స్‌కు చైర్మన్ అయ్యారు. 2012 వరకు కొనసాగారు. 2016 అక్టోబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2000లో ఆయనకు పద్మ భూషణ్, 2008లో పద్మ విభూషణ్ లభించాయి.



### జేపీ నడ్డా

- ప్రపంచ ఆరోగ్య సంస్థలో భాగమైన ఆగ్నేయాసియా ప్రాంతీయ కమిటీ 77వ సమావేశానికి జేపీ నడ్డా చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సమావేశాలు అక్టోబర్ 7న ప్రారంభమయ్యాయి. ఆగ్నేయాసియాలో వైద్య రంగంలో తీసుకోవాల్సిన చర్యలను ఇందులో ప్రస్తావించారు.

### కైస్ సయీద్

- ట్యునీషియా రాష్ట్రపతిగా కైస్ సయీద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ బాధ్యతలు ఆయన చేపట్టడం వరుసగా రెండోసారి.

### మిడోరి ప్రైజ్

- జీవ వైవిధ్యం కోసం కృషి చేసే వాళ్లకు ఇచ్చే మిడోరి ప్రైజ్ అవార్డ్ ఈ ఏడాది ఇద్దరికి దక్కింది. కజకిస్థాన్‌కు చెందిన వెర వొరొనోవా, అలాగే పెరూకు చెందిన ఆగస్టినా కాల్టెరాన్ కూడా ఈ అవార్డుకు ఎంపికయిన వాళ్లలో ఉన్నారు. ఏఈవోఎన్ ఎన్వైర్‌మెంటల్ ఫౌండేషన్ అనే సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. జీవ వైవిధ్య ఒప్పంద వ్యవస్థతో కలిసి ఈ అవార్డును ఇవ్వనుంది.

### ప్రీతిపాల్ కౌర్

- 40 అండర్ 40 అవార్డును హర్యానాకు చెందిన ఐపీఎస్ అధికారి ప్రీతిపాల్ కౌర్ గెలుచుకున్నారు. అమెరికా కేంద్రంగా పని చేసే ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ చీఫ్స్ ఆఫ్ పోలీస్ ఈ అవార్డు ఇస్తుంది. ప్రస్తుతం నాగాలాండ్ రాష్ట్రంలో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. దంత వైద్య వృత్తి నిర్వహిస్తూనే సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. మహిళాశ సాధికారత, మహిళల విద్య కోసం చేస్తున్న కృషికి ఆమెకు ఈ అవార్డ్ దక్కింది.

### శరద్ కుమార్

- క్రికెట్‌లో అవినీతి జరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన యాంటీ కరప్షన్ యూనిట్‌కు సారథిగా శరద్ కుమార్‌ను నియమించారు. ఆయన ఐపీఎస్ అధికారి. పదవీ విరమణ పొందారు.

### వేణుగోపాల్

- ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ అక్టోబర్ 8న మరణించారు. దేశంలో గుండె ట్రాన్స్‌ప్లాంట్ చేసిన తొలి వైద్యుడు ఆయన. 50,000 గుండె ఆపరేషన్లను విజయవంతంగా చేశారు.

## అంతర్జాతీయం

### ప్రపంచ బ్యాంక్




- సులభతర వ్యాపార సూచీ స్థానంలో వ్యాపార సంసిద్ధత సూచీని ప్రపంచ బ్యాంక్ ప్రవేశపెట్టింది. సులభతర వ్యాపార సూచీ గణన విధానానికి సంబంధించి పలు విమర్శలు రావడంతో 2021లో నిలిపివేసింది. కొత్త సూచీలో భాగంగా 50 దేశాల ఆర్థిక వ్యవస్థలను పరిశీలించి ర్యాంకులను కేటాయించనుంది. 2026లో 180 దేశాలకు విస్తరిస్తారు. ఇందులో మూడు మూల స్తంభాలున్నాయి. అవి.. నియంత్రణ నిబంధనలు, ప్రభుత్వ సేవలు, నిర్వహణ సామర్థ్యం.

### ప్రపంచ వాతావరణ సంస్థ

- 2023లో ప్రపంచంలో చాలా నదుల ప్రవాహం పొడిగా ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. గడిచిన 33 సంవత్సరాల్లో చూడనంత స్థాయిలో నీటి ప్రవాహం తగ్గిందని పేర్కొంది. వరుసగా ఐదో సంవత్సరం కూడా ప్రపంచంలోని ఏ నది కూడా తన పూర్తి స్థాయి ప్రవాహంతో లేదని వెల్లడించింది.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ

- భారతదేశాన్ని ట్రకోమా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కంటికి సోకే రుగ్మత ఇది. అంధత్వానికి దారి తీస్తుంది. ఆగ్నేయాసియాలో ట్రకోమాను పూర్తిగా నిర్మూలించిన మూడో దేశం భారత్. తొలి రెండు దేశాలు నేపాల్, మయన్మార్. మొత్తం ఆసియా ఖండంలో ట్రకోమా రహిత దేశాల సంఖ్య ప్రస్తుతం 19.




### ఐఆర్ఈఎన్ఏ

- 2023 నాటికి పునరుత్పాదక శక్తి రంగంలో ఉద్యోగాల సంఖ్య భారతదేశంలో 1.02 మిలియన్లకు చేరిందని అంతర్జాతీయ పునరుత్పాదక శక్తి ఏజెన్సీ తాజా నివేదికలో పేర్కొంది. అంతర్జాతీయ కార్మిక సంస్థతో కలిసి ఈ నివేదికను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ రంగంలో ఉద్యోగాల సంఖ్య 16.2 మిలియన్లకు చేరింది. భారత్‌లో అతిపెద్ద పునరుత్పాదక శక్తి వనరుగా జల విద్యుత్ ఉంది. జల విద్యుత్‌లో ఉద్యోగాల కల్పనలో భారత్ రెండో స్థానంలో ఉంది. మొత్తం ప్రపంచంలో ఉద్యోగాల్లో భారత్ వాటా 20%. తొలి స్థానంలో చైనా ఉంది.

### బంగ్లాదేశ్

- బంగ్లాదేశ్ దేశ రాజ్యాంగాన్ని సమీక్షించేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో 9 మంది సభ్యులు ఉన్నారు. దీనికి బంగ్లాదేశ్-అమెరికన్ ప్రొఫెసర్ అలీ రియాజ్ నేతృత్వం వహిస్తారు. 90 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానుంది.

### కజకిస్థాన్

- కజకిస్థాన్‌లో తొలిసారి అణు విద్యుత్ కేంద్రం నిర్మాణానికి రెఫరెండం నిర్వహించింది. ప్రజలు సానుకూలంగా స్పందించారు. దీంతో విద్యుత్ అవసరాల కో సం బల్కష్ సరస్సు సమీపంలో అణు విద్యుత్ స్టేషన్ నిర్మించాలని ఆ దేశం నిర్ణయించింది.

## తెలంగాణ

### వర్గీకరణ తర్వాతే నోటిఫికేషన్లు



- సుప్రీంకోర్ట్ తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు హైకోర్ట్ మాజీ న్యాయమూర్తితో ఏకసభ్య కమిషన్‌ను వెంటనే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కమిషన్ నియామకంలో అడ్వకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉపసంఘం తీర్మానించింది. ఏక సభ్య కమిషన్ చట్టపరంగా పటిష్టంగా ఉండటంతో పాటు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేలా నియామకం జరగాలని సబ్ కమిటీ ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సబ్ కమిటీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వం వహించారు. పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఎంపీ మల్లు రవి సభ్యులు.

### తైవాన్‌తో ఒప్పందం

- తెలంగాణ-తైవాన్ మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని పెంపొందించేందుకు తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ తెలంగాణ ప్రభుత్వ ఐటీఈసీ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేశారు. తైపీలో అక్టోబర్ 7న నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.



### 321 సంస్థలు

- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత పది నెలల కాలంలో 321 సంస్థలు పెట్టుబడులు పెట్టాయని రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ పేర్కొంది. వీటి ద్వారా రూ. 7108 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి దక్కాయి. 25,277 మంది యువతకు ఉద్యోగాలు దక్కాయి.

### హైడ్రా ఏర్పాటుకు ఆర్డినెన్స్

- హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీకి విస్తృత అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది.

## జాతీయం

### భారత్‌లో మాల్దీవుల అధ్యక్షుడు

- మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజు భారత్‌లో పర్యటించారు. ఇందులో భాగంగా నగదు స్వాప్‌తో పాటు పర్యాటక రంగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి.

### కైమూర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం

- కైమూర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో పులుల రిజర్వ్‌ను ఏర్పాటు చేసేందుకు బీహార్ రాష్ట్రానికి అనుమతి లభించింది. వింధ్యాచల్ పర్వత శ్రేణిలో ఇది ఉంది. సొన్ నదితో పాటు కవ్ నది కూడా ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తాయి.



### హర్యానాలో బీజేపీ విజయం

- హర్యానా, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. 90 సీట్లున్న ఈ శాసనసభలో ఆ పార్టీ 48 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 37 సీట్లను మాత్రమే గెలుచుకుంది. మరో వైపు జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాలను గెలుచుకుంది. ఇక్కడ కూడా 90 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా బీజేపీ 29, కాంగ్రెస్ ఆరు స్థానాల్లో గెలిచాయి.

### భారతీయ కళా మహోత్సవం

- భారతీయ కళా మహోత్సవాన్ని ఎనిమిది రోజుల పాటు సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో నిర్వహించారు. అక్టోబర్ 7న ఇవి ముగిశాయి. ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల నుంచి కళాకారులు, చేతివృత్తుల వాళ్లు ఇందులో పాల్గొన్నారు. తమ కళలను ప్రదర్శించారు.



### హైడ్రోజన్ బ్లెండింగ్ ప్రాజెక్ట్

- దేశంలో అతిపెద్ద హైడ్రోజన్ బ్లెండింగ్ ప్రాజెక్టును గుజరాత్‌లో ప్రారంభించారు. 2.2-2.3% హరిత హైడ్రోజన్‌ను ఇది బ్లెండింగ్ చేస్తుంది. హరిత వాయు ఉద్గారాలను తగ్గించేందుకు ఉపయోపగపడే ప్రాజెక్ట్ ఇది. అహ్మదాబాద్‌లో దీన్ని అదాని సంస్థ నెలకొల్పింది.

### సైబర్ కమాండో ట్రెయినింగ్

- పోలీసులకు సైబర్ కమాండో శిక్షణను ఐఐటీ మద్రాస్ ప్రారంభించింది. ఆరు నెలలు ఇది కొనసాగనుంది. కేంద్ర హోం శాఖ దీన్ని పర్యవేక్షిస్తుంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీసులకు ఈ శిక్షణను ఇవ్వనున్నారు.

## రోజులు-ప్రాధాన్యం

### అక్టోబర్ 9

- ప్రపంచ పోస్టల్ రోజును ప్రతి సంవత్సరం అక్టోబర్ 9న నిర్వహిస్తారు. 1969లో అక్టోబర్ 9న ప్రపంచ పోస్టల్ సమావేశం జరిగిన సందర్భంగా ఈ రోజును ఎంపిక చేశారు. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్విట్జర్లాండ్‌లోని బెర్న్ కేంద్రంగా పనిచేస్తుంది. దీన్ని 1874లో ఏర్పాటు చేశారు.


### అక్టోబర్ 8

- భారత వాయు దళాన్ని 1932 అక్టోబర్ 8న ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఏటా అక్టోబర్ 8న భారత వాయుసేన రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'భారత వాయుసేన: సాక్షం, సశక్త్, ఆత్మనిర్భర్'

### అక్టోబర్ 7

- ఏటా ప్రపంచ పత్తి దినోత్సవాన్ని అక్టోబర్ 7న నిర్వహిస్తారు. టెక్స్‌టైల్ రంగంలో ఈ పంట కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 కోట్ల కుటుంబాలు పత్తిపై ఆధారపడ్డాయి.

## నోబెల్




### వైద్య రంగం

- వైద్య రంగంలో విక్టర్ అంబ్రోస్, గారి రువుకున్‌లకు నోబెల్ దక్కింది. సూక్ష్మ ఆర్ఎన్ఏలపై చేసిన పరిశోధనకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు అమెరికా దేశానికి చెందిన శాస్త్రవేత్తలు.

### రసాయన శాస్త్రం


- డేవిడ్ బేకర్, హసాబిస్ జాన్ జంపర్‌లకు రసాయన శాస్త్రంలో నోబెల్ దక్కింది. జీవానికి నిర్మాణ అణువులు అయిన ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేశారు. ప్రొటీన్ల నిర్మాణాన్ని అంచనా వేయడంతో పాటు వాటికి సంబంధించి అనేక కొత్త డిజైన్లను వారు రూపొందించారు.

### సాహిత్యం

- దక్షిణ కొరియా రచయిత్రి హాన్‌కాంగ్‌కు సాహితీ నోబెల్ లభించింది. రచనలో చారిత్రక పరిణామాలు, వాటి వల్ల వచ్చిన ఇబ్బందులు, మానవ జీవితంలోని దుర్బలత కళ్లకు కట్టేలా రచిస్తారని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది.

### భౌతిక శాస్త్రం

- జాన్ హోప్ ఫీల్డ్, జాఫ్రీ హింటన్ భౌతిక శాస్త్రం విభాగంలో నోబెల్ గెలుచుకున్నారు. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లపై చేసిన పరిశోధనకు ఈ అవార్డ్ దక్కింది.




వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

